

దేదీప్యమానంగా ఇంద్రకీలాద్రి





ఇంద్రకీలాద్రి దేవీశరన్నవరాత్రులకు శోభాయమానంగా ముస్తాబైంది. ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా ప్రకాశించింది. ఓంకారం, కనకదుర్గమ్మ రూపాలు కనుల విందు చేశాయి. వివిధ వర్ణాల విద్యుత్ దీపాలతో ఇంద్రకీలాద్రి ధగధగా మెరిసిపోయింది. భక్తులను తన్మయత్వానికి గురిచేసింది. విజయవాడ నగరమంతటా ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది.

ధగధగ

గత వైఫల్యాలను గుర్తిస్తేనే ‘విజయ’వంతం

- కీలకమైన పాయింట్లలో నిరంతర పర్యవేక్షణ అవసరం
- అనధికారానికి అడ్డుకట్ట వేస్తే అంతా సాఫీ
- శరన్నవరాత్రులకు దగ్గర పడుతున్న సమయం

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాల అంకురార్పణకు హడావుడి మొదలైంది. మూడో తేదీ నుంచి అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్సవాల కోసం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేసినప్పటికీ సామాన్య భక్తుల మనస్సు గెలుచుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఉత్సవాల్లో ఇదే కనిపించింది. గంటల తరబడి సుదూరం నడిచిన భక్తుల్లో ముందు జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆగ్రహావేశాలను రగిలిస్తున్నాయి. ఈ ఏడాది ఉత్సవాలను విజయవంతం చేయడానికి పోలీస్, రెవెన్యూ, వీఎంసీ, దేవదాయ శాఖలు ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఇప్పటి వరకు ఉత్సవాల్లో ప్రతి ఏడాది ఉత్పన్నమవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరి ంచినప్పుడే ఈ ప్రణాళికలకు ప్రభుత్వం పట్టం కట్టే అవకాశాలు ఉంటాయి.

- (ఆంధ్రజ్యోతి - విజయవాడ)

దసరా ఉత్సవాలు ప్రారంభం రోజు నుంచి మూడు రోజులపాటు భక్తుల సంఖ్య స్వల్పంగా ఉంటుంది. ఆ తర్వాత రద్దీ పెరుగుతుంది. అమ్మవారి దర్శనానికి భక్తులు వినాయకుడి గుడి నుంచి క్యూల్లో ప్రధాన ఆలయానికి చేరుకుంటారు. దర్శనానంతరం బయటకు వచ్చిన భక్తులు పెద్ద రాజగోపురం వైపు వెళ్లకుండా శివాలయం వైపునకు వెళ్లేలలాలలదవఖా పోలీసులు రావిచెట్టు ముందు బారికేడ్లు ఏర్పాటు చేశారు. బయటకు రావాల్సిన ద్వారం నుంచి కొంతమంది అమ్మవారి దర్శనాలకు వెళ్తుంటారు. వీఐపీల ముసుగులో కొంతమంది, దేవదాయ శాఖ సిబ్బంది పేరుతో కొంతమంది ఇలా లోపలకు వెళ్లే ప్రయత్నం చేస్తుంటారు. ఉత్సవాల్లో

‘బయట’ నుంచే లోపలకు

విధులు నిర్వర్తించడానికి వచ్చిన సిబ్బంది తమ కుటుంబ సభ్యులను ఈవిధంగానే దర్శనాలకు తీసుకెళ్తుంటారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు విధులు నిర్వర్తి స్తారు. వారితో వివాదం పెట్టుకుని మరీ లోపలకు వెళ్తుంటారు. ఇక్కడ నుంచి లోపలకు వెళ్లే భక్తులు పెరిగిపోవడంతో బయటకు వచ్చే ద్వారం వద్ద ప్రతి ఏడాది ఒక గందరగోళ పరిస్థితి ఏర్పడు తుంది. ఈ ద్వారం నుంచి లోపలకు వెళ్లిన భక్తులు ఆశీర్వచన మండపం నుంచి ప్రధాన ఆలయం వెనుక వైపు మార్గంలో వెళ్లి వీఐపీ భక్తుల క్యూలో కలుస్తారు. వాస్తవానికి ఈ ద్వారం నుంచి ఆలయం లోపల విధులు నిర్వర్తించే సిబ్బంది మాత్రమే వెళ్లడానికి అనుమతి ఉంటుంది. ఇలా విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగి కచ్చితంగా పాసును ధరించాలి. ఆలయంలో పనిచేసే సిబ్బంది కొంతమంది పాసులు ధరించకపోవడం, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసులకు వారు ఎవరో తెలియకపోవడంతో కొన్నిసార్లు వివాదాలు వస్తున్నాయి. వీఐపీ దర్శన మార్గంలో వెళ్లాల్సిన భక్తులను ఎగ్జిట్ ద్వారం వైపు రాకుండా కట్టడి చేస్తే సమస్య ఉండదు.

భక్తుల కోసం అధికారులు ఉచిత దర్శనం, రూ.100, రూ.300, రూ.500 క్యూలను ఏర్పాటు చేస్తారు. ఇవి కాకుండా ప్రధాన ఆలయానికి, రూ.500 టికెట్ల క్యూలైన్‌కి మధ్య కొంత ఖాళీ ప్రదేశం ఉంటుంది. ఇక్కడి నుంచి ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారిని దర్శనాలకు తీసుకెళ్తారు. వాస్తవానికి ఈ క్యూలో ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారు మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్యూ ప్రారంభం వద్ద బారికేడ్‌కు గేటు ఉంటుంది. దానికి ఆలయ

ఆలయం వెనుక అలజడి

అధికారులు తాళాలు వేస్తారు. వీఐపీలు వచ్చినప్పుడు మాత్రమే ఈ గేటును తీస్తారు. చిన్న రాజగోపురం వద్ద ఉన్న ఈవో కార్యాలయం పక్కన ఉన్న మెట్ల నుంచి కొంతమంది అనధికారికంగా వివిధ వ్యక్తుల సిఫార్సులతో నేరుగా వీఐపీ క్యూ వద్దకు వెళ్తారు. గేటుకు తాళాలు వేసి ఉండడంతో భక్తులు ఇక్కడే ఆగిపోతున్నారు. రూ.500 క్యూలోకి వెళ్లాలని పోలీసులు పదేపదే చెప్పినా భక్తులు కదలని పరిస్థితులు ఉన్నాయి. ఈ ఖాళీ ప్రదేశంలో భక్తులు పెరిగిపోవడంతో అధికారులు చేసేది లేక గేటుకు తాళాలు తీయాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. తీరా ఇక్కడికి వచ్చిన భక్తులను క్యూలైన్‌లోకి వెళ్లమనే సరికి వారికి ఆగ్రహం వస్తోంది. దీనితో ఇక్కడ వివాదాలు ముసురుతున్నాయి.

ఆ ప్రదేశమే కీలకం

శరన్నవరాత్రుల్లో భక్తుల రాకలన్నీ ఘాట్ రోడ్డు మీదుగానే సాగుతాయి. పాసులు ఉన్న వాహనాలను టోల్‌గేట్ వద్ద ఉన్న పోలీసులు కొండపైకి అనుమతిస్తారు. కొండపైకి వెళ్లిన తర్వాత ఓం మలుపు వద్ద మరో చెకింగ్ పాయింట్ ఉంటుంది. ఇక్కడ పాసులు ఉన్న వారిని, శరన్నవరాత్రి ఉత్సవాల విధులు నిర్వర్తించే వారిని అనుమతిస్తారు. మిగిలిన వారిని పక్కనే ఉన్న క్యూలైన్లలోకి పంపుతారు. ఇక్కడికి వచ్చిన భక్తులు కొంతమంది ఏదో ఒక సిఫార్సుతో ఈ చెకింగ్ పాయింట్ దాటుకుని వెళ్తున్నారు. మౌనముని విగ్రహం ఉన్న ప్రదేశంలో మీడియా పాయింట్ ఉంటుంది. దీనికి ముందు మరో చెకింగ్ పాయింట్ ఉంటుంది. మీడియా పాయింట్‌కు చెంతన రెండు డీఎఫ్ఎండీలు ఉంటాయి. వాటికి పక్క నుంచి క్యూలైన్‌లు వెళ్తాయి. ఈ క్యూలైన్లకు పక్కన విశాల ప్రదేశం ఉంటుంది. ఇక్కడ అధికారులు కూర్చుంటారు. మీడియా ప్రతినిధులు ఇక్కడే ఉంటారు. ఓం మలుపు, మౌనముని విగ్రహం వద్ద ఉన్న చెకింగ్ పాయింట్ దాటుకుని కొంతమంది ఈ ఖాళీ ప్రదేశంలోకి వచ్చి రాజగోపురం కింద నుంచి దర్శనాలకు వెళ్తున్నారు. ముందు ఉన్న చెకింగ్ పాయింట్లు దాటుకుని రావడంతో ఇక్కడ బందోబస్తు నిర్వహించే పోలీసులు గానీ, దేవదాయ సిబ్బంది గానీ వారిని ప్రశ్నించడం లేదు. ఇంత వరకు వచ్చారంటే వాళ్లంతా ఎవరో ఒకరి సిఫార్సులతో వచ్చి ఉంటారని భావిస్తున్నారు. రూ.500 టికెటు కొనుగోలు ఆ లైన్‌లో వెళ్లాల్సిన భక్తులు వాటిని చూపించి రాజగోపురం వద్ద నుంచి దర్శనాలకు వెళ్లిన దాఖలాలు ఇంతకుముందు కనిపించాయి. ఇలాంటి వారిని ఓం మలుపు, మౌనముని విగ్రహం వద్ద ఉన్న చెకింగ్ పాయింట్ల వద్ద కచ్చితంగా నిలుపుదల చేయాలి. లేకపోతే రాజగోపురం వద్ద అనధికార దర్శనాల భక్తులు పెరిగిపోయే అవకాశం ఉంది. ఇలా గుంపులు గుంపులుగా క్యూలైన్లలో ఉన్న భక్తులు వెళ్లడంతో గంటల తరబడి నిలబడి ఉన్న వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిణామంతోనే రూ.500క్యూలో ఉన్న భక్తులు ఈవో డౌన్‌డౌన్ అంటూ రెండేళ్ల కిందట ఉత్సవాల్లో నినాదాలు చేశారు. రాజగోపురం వైపు ఉన్న మార్గం నుంచి వీఐపీలను తప్ప ఇతర వ్యక్తులు వెళ్లకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకేసారి గుంపులుగా

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వీఐపీ దర్శనాలకు గుంపులు గుంపులుగా వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అప్పటి మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు దీనికి ఆద్యుడు. ఆయన దర్శనానికి వచ్చినప్పుడు ఉదయం, సాయంత్రం పూట వెంట 100 మందికి తక్కువ కాకుండా చూసుకుని తీసుకెళ్లేవారు. ఆయన అధికారంలో ఉండడంతో ఆలయ అధికారులు గానీ, బందోబస్తు నిర్వహించిన పోలీసులు గానీ అభ్యంతరం చెప్పే సాహసం చేయలేదు. గంటల తరబడి క్యూల్లో నిలబడిన భక్తుల ఎదురుగానే అంతమంది వీఐపీ దర్శనానికి ఒకేసారి వెళ్లడం అనేక విమర్శలు తావిచ్చింది. అయినా ఆయన పద్ధతి మార్చుకోలేదు. మంత్రి పదవి పోయిన తర్వాత ఇదేవిధంగా వ్యవహరించారు. వీఐపీ దర్శనాలకు వెళ్లడమే కాకుండా అంతమందికి అంతరాలయం దర్శనాలు చేయించేవారు. సాధారణంగా శరన్నవరాత్రుల్లో అంతరాలయం దర్శనాలను రద్దు చేస్తారు. ఆయన మాత్రం తన మందిమార్బలంతో వచ్చి అంతరాలయం దర్శనాలు చేయించుకునేవారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



విద్యుత్ దీపాల వెలుగుల్లో దుర్గమ్మ ఆలయం

236



ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు

ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైన ‘మద్యం’ విధానంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. నూతన మద్యం పాలసీతో గాడిలో పెట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం షాపుల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. ప్రస్తుతం జిల్లాలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రకటించడంతో ఆ దుకాణాలు రద్దయ్యాయి. కొత్త పాలసీ ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో 236 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఇంతకుముందు విధంగానే దరఖాస్తులు స్వీకరించి, లాటరీ విధానంలో ఈ షాపులను కేటాయించనున్నారు.

ఎన్టీఆర్‌లో 113.. కృష్ణాలో 123

- మద్యం షాపులకు గెజిట్ విడుదల
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ
- ఎక్సైజ్ స్టేషన్లలోనూ దరఖాస్తుకు అవకాశం
- స్వీకరణకు ఈ నెల 9వ తేదీ తుది గడువు

(ఆంధ్రజ్యోతి - అమరావతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త మద్యం పాలసీ ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో 236 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణాజిల్లాలో 123 దుకాణాలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇవి కాకుండా కల్లు గీత కార్మికులకు పది శాతం షాపులను కేటాయిస్తారు. దీనికి సంబంధించిన గెజిట్‌ను రెండు జిల్లాల కలెక్టర్లు మంగళవారం విడుదల చేశారు. విజయవాడలో 39 షాపులు, మచిలీపట్నంలో ఐదు షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 74, కృష్ణాజిల్లా వ్యాప్తంగా 188 షాపులు ఏర్పాటు చేసుకునేలా గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. షాపులు ఏర్పాటు చేసుకోవాలనుకున్న వారు మంగళవారం సాయంత్రం నుంచి ఆబ్కారీ శాఖకు చెందిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తును సమర్పించుకోవచ్చు. ఇది కాకుండా మాన్యువల్ విధానంలోనూ దరఖాస్తులను స్వీకరించాలని ఎక్సైజ్ అధికారులు నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. విజయవాడలో విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ, భవానీపురం స్టేషన్లు ఉన్నాయి. ఇవి కాకుండా జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, నందిగామ, తిరువూరులో ఎక్సైజ్ స్టేషన్లు నడుస్తున్నాయి. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం, అవనిగడ్డ, బంటుమిల్లి, గన్నవరం, గుడివాడ, మొవ్వ, నందివాడలో స్టేషన్లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించలేని వారు ఈ స్టేషన్లలో దరఖాస్తులను అందజేయవచ్చు. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫీజుల చెల్లింపునకు మూడు శ్లాబ్‌లను నిర్ణయించారు.


ఫీజుల చెల్లింపునకు ఇలా మూడు శ్లాబ్‌లను నిర్ణయించారు.

జనాభా పరిధి	చెల్లించాల్సిన ఫీజు
10,000 - 50,000	రూ.55 లక్షలు
50,000 - 5 లక్షలు	రూ.65 లక్షలు
5 లక్షలు- ఆపైన	రూ.85 లక్షలు

రెండేళ్ల కాలపరిమితికి లైసెన్స్

అభ్యర్థులు దరఖాస్తుతోపాటు రూ.2లక్షల దరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని తిరిగి ఇవ్వరు. షాపులకు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినప్పుడు లాటరీ విధానంలో షాపులు కేటాయిస్తారు. అభ్యర్థులు తొమ్మిదో తేదీ సాయంత్ర ఐదు గంటల లోపు ఆన్‌లైన్‌లో గానీ, ఎక్సైజ్ స్టేషన్‌లో గానీ అందజేయాలి. పదో తేదీన అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలిస్తారు. 11వ తేదీన జిల్లా కలెక్టర్ల సమక్షంలో షాపులు కేటాయిస్తారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన షాపులకు విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో లాటరీ తీస్తారు. ఎక్సైజ్ అధికారులు రెండు ఏళ్ల కాలపరిమితికి లైసెన్స్ ఇస్తారు. నిర్ణయించిన ఫీజు ఏడాది కాలానికే వర్తిస్తుంది. రెండో ఏడాది దీనికి పది శాతం ఫీజును పెంచుతారు.

6లో



వరాల జల్లు కురిసేనా!

నేడు సీఎం చంద్రబాబు మచిలీపట్నం రాక

- వేధిస్తున్న డ్రైయినేజీ సమస్య
- సొంత భవనాలకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాలు
- పూర్తికాని బందరు పోర్టు, మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు
- రూ.65వేల కోట్ల ఆయిల్ రిఫైనరీ కార్పొరేషన్‌పై ప్రకటన వచ్చేనా!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో ఎన్.చంద్రబాబు నాయుడు తొలిసారిగా బుధవారం మచిలీపట్నం వస్తున్నారు. ఇక్కడ అనేక సమస్యలు నగర వాసులను వేధిస్తున్నాయి. వీటిపై ముఖ్యమంత్రి చొరవ చూపి తమపై వరాల జల్లు కురిపిస్తారనే ఆశతో బందరు వాసులు ఎదురు చూస్తున్నారు.

వర్షం కురిస్తే కాలువలను తలపిస్తున్న రోడ్లు

ఇటీవలే మునిసిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడిన మచిలీపట్నంలో కొద్దిపాటి వర్షం కురిస్తే ప్రధాన రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. సముద్ర మట్టానికి రెండు అడుగుల దిగువన ఉన్న నగరాన్ని డ్రెయిన్‌ల సమస్య వేధిస్తోంది. డ్రెయిన్‌లను కొంతమేర నిర్మాణం చేసినా వాటిని చివరి ప్రాంతాలలో ప్రధాన డ్రెయిన్‌లకు అనుసంధానం చేయకపోవడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

నగరంలో తీవ్ర తాగునీటి ఎద్దడి

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 2.50లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. మచిలీపట్నం మండలంలో మరో 75వేల మంది నివాసం ఉంటున్నారు. సముద్రతీర ప్రాంతం కావడంతో ఏటా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తుతోంది. నగరం, మండల ప్రజల తాగునీటి అవసరాల కోసం మచిలీపట్నంకు

- మిగతా 6లో

2వ రోజూ దరఖాస్తుల వెల్లువ

పరిహారం కోసం భారీగా తరలివచ్చిన బాధితులు

- కిక్కిరిసిపోయిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్
- అన్ని అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా యంత్రాంగం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద సాయం కోసం రెండో రోజూ విజయవాడలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు పెద్ద ఎత్తున ఎన్టీఆర్ కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందల సంఖ్యలో అర్జీలు సమర్పించారు. వాస్తవానికి అర్జీలు సమర్పిస్తున్నవారంతా కూడా 179 సచివాలయాల పరిధిలో లేరు. ఎన్యూమరేషన్‌కు ముందుగా గుర్తించిన 179 సచివాలయాల పరిధిలోని వారికే వరద సాయం అందించటం జరుగుతోంది. ఈ సచివాలయాల పరిధిలోనే వరద ముంపునకు గురి కావటం వల్ల ఇక్కడి వారినే అర్హులుగా గుర్తించారు. కానీ అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారు. వరద ముంపునకు గురైన ప్రాంతంలోని వారు కూడా ఇంకా తమకు పరిహారం అందలేదని వస్తున్నారు. వీరిలో ఇప్పటికే వరద సాయం పొందిన కుటుంబాలలోని ఇతర కుటుంబ సభ్యులు కూడా వస్తుండటం గమనార్హం. కుటుంబంలో ఎవరైనా ఒకరికే పరిహారం అందుతుంది. అందరికీ పరిహారం ఇవ్వరు. ప్రతి ఇంట్లో కూడా యజమాని బ్యాంకు ఖాతాలోనే ప్రభుత్వ పరిహారం జమ అవుతుంది. యజమాని బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోయినా.. వారి కుటుంబ సభ్యులలో భార్య, పిల్లలకు సంబంధించి బ్యాంకు ఖాతాలు ఏవైనా ఆధార్‌కు అనుసంధానమై ఉంటే వారి ఖాతాలలో డబ్బులు వేస్తున్నారు. బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌లో లేకపోతే డబ్బులు పడటం లేదు. అలాంటి వాటికి సంబంధించి రీ వెరిఫికేషన్ చేసి డబ్బులు ఇస్తున్నారు. గొల్లపూడి, జక్కంపూడి, కండ్రిక ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పరిహారం కోసం వస్తుండటంతో అనుమానాలు నెలకొంటున్నాయి. ఈ ప్రాంతాలలో అర్హులైన వారి అందరికీ పరిహారం ఇవ్వటం జరిగింది. పరిహారం ఇచ్చినప్పటికీ ఇంకా ఎందుకు వస్తున్నారన్నది మిస్టరీగా మారింది. ఏది ఏమైనప్పటికీ ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అన్ని దరఖాస్తులను కూడా ప్రత్యేక కౌంటర్ల ద్వారా స్వీకరిస్తోంది. ఈ దరఖాస్తులకు సంబంధించి ప్రతి ఒక్కదానిని కూడా పరిశీలించి అర్హులు అయితే మాత్రం వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకోనున్నారు.



సున్నపురాయి తవ్వుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగభూషణం, రెవెన్యూ సిబ్బంది

సున్నపురాయి తవ్వకాలపై ప్రత్యేక నిఘా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మండల సర్వేయర్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

- బాపులపాడు తహసీల్దార్ నాగభూషణం
- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సున్నపురాయి తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు బాపులపాడు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. మల్లవల్లిలో అక్రమంగా సున్నపురాయి తవ్వి తరలిస్తుండటంపై ఆంధ్రజ్యోతి ‘గుట్టుగా సున్నపురాయి తరలింపు’ అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన తహసీల్దార్ నాగభూషణం మల్లవల్లిలో జరుగుతున్న తవ్వకాలను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ మొక్కలు వేసుకునేందుకే తవ్వుతున్నామని రైతు చెప్పారన్నారు. సున్నపురాయి నాణ్యత తేల్చేందుకు, ఎక్కడకు తరలిస్తున్నారో తెలుసుకునేందుకు మండల సర్వేయర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సభ్యులు ఇచ్చిన నివేదికను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. వారి నిర్ణయం మేరకు చర్యలుంటాయన్నారు.



దసరా ఏర్పాట్లపై మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులతో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

» ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో మంత్రి ఆనం సమీక్ష

వన్‌టౌన్, అక్టోబరు 1 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో గురువారం నుంచి జరగనున్న దసరా మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్టు దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం హోంమంత్రి వంగలపూడి అనిత, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన రావు, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, కలెక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, 13 శాఖల అధికారులు, ప్రతినిధులతో దసరా మహోత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దసరా మహోత్సవాలను నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు, సమన్వయంతో విధులు నిర్వహిస్తారని తెలిపారు. వీవీఐపీలు టైమ్ స్లాట్‌లోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుందన్నారు. గురువారం అమ్మవారికి స్నపన, అలంకార కార్యక్రమాలు ఉండటంతో ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనం ఉంటుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు సాయంత్రం 4 నుంచి 5 లోగా అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వీలు కల్పించామన్నారు. ఎవరికీ అంతరాలయ దర్శనం లేదని స్పష్టం చేశారు. పది రోజుల పాటు జరగనున్న దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరి సహకారం కోరుతున్నామని తెలిపారు. ఆలయ గోపురాలు, ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, పూలమాలలతో అలంకరిస్తున్నట్టు తెలిపారు. సాయంసంధ్య వేళ కృష్ణవేణి నదీమ తల్లికి పూర్తి ఆధ్యాత్మిక సొబగులతో నవ హారతుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గం నిర్మాణం చేసి తీరుతాం

» నరసాపురం-మచిలీపట్నం లైనుకు సర్వే : ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గం నిర్మాణానికి తొలిఅడుగు పడిందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. మచిలీపట్నంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోస్తాతీరం వెంబడి రెండు రైల్వేలైన్ మార్గాలకు కేంద్రప్రభుత్వం అనుమతులిచ్చిందని తెలిపారు. మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ మార్గం దివిసీమ, మచిలీపట్నం ప్రజల చిరకాల వాంఛగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు కోరుకున్న విధంగా మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఇపుడున్న నిబంధనల ప్రకారం ఈ రైల్వేలైన్ సర్వేకు అనుమతులు వచ్చాయన్నారు. నిర్మాణానికి డీపీఆర్ తయారవుతోందన్నారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా కృషిచేస్తానని తెలిపారు. ఈ మార్గం ఏర్పడితే హౌరా-చెన్నైల మధ్య 70కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. ప్రయాణికులకు ప్రయాణ సమయం తగ్గడంతోపాటు, సరుకుల రవాణా తక్కువఖర్చుతో చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌ను బాపట్ల వరకు కలిపితే నేరుగా చెన్నై వెళ్లేందుకు అవకాశం ఉంటుందని కేంద్రమంత్రి వైష్ణవ్‌కు రైల్వే అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. నరసాపురంనుంచి మచిలీపట్నం వరకు నూతన రైల్వేలైన్ పెడన నియోజకవర్గంలోని మాట్లాం, పల్లెపాలెం, బంటుమిల్లిమీదుగా మచిలీపట్నం నియోజకవర్గంలోని చిలకలపూడి, మచిలీపట్నం వరకు రైల్వేలైన్ నిర్మాణానికి సర్వే జరుగుతోందన్నారు.

కొలికపూడి బహిరంగ క్షమాపణ చెప్పాలి

తిరువూరు, అక్టోబరు 1 : రైతుల కోసం ఉద్యమాలు చేశానని గొప్పలు చెప్పుకుంటున్న ఎమ్మెల్యే కొలికపూడి రైతుల్ని చులకన చేస్తూ చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు పల్లెపాటి శ్రీనివాసరావు, ఉప్పలపాటి లక్ష్మీదాసులు మాట్లాడుతూ, రైతులపై ఎమ్మెల్యే చేసిన తీవ్ర వ్యాఖ్యల్ని ఖండించారు. తక్షణం కొలికపూడి రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. జీవన్‌బాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యల్ని రైతు నెక్కడపు భవాని ప్రసాద్ తీవ్రంగా ఖండించారు.

పద్ధతి మార్చుకోవాలి : సీపీఐ

ఎమ్మెల్యే కొలికపూడి రైతుల్ని, ప్రజల్ని భయందోళనకు గురిచేస్తున్నాడని, అయన పద్ధతి మార్చుకోవాలని రైతుసంఘం నేతలు హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో రైతుసంఘం నేతలు తూము కృష్ణయ్య, వనమాలి, డేవిడ్ తదితరులు మాట్లాడుతూ, అందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టిసారిస్తుంటే, కొలికపూడి మాత్రం ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, రైతులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కొలికపూడి క్షమాపణ చెప్పకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మిక్ కళాశాలకు వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

కంచికచర్ల, అక్టోబరు 1 : మిక్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యధిక ఇంటర్న్‌షిప్‌లు చేసినందుకుగాను ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ ఎడ్యు స్కిల్స్ ద్వారా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.వంశీకిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎడ్యుస్కిల్స్ సంస్థ మూడేళ్లుగా మిక్ విద్యార్థులకు ఉచిత ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నది. సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా ఐదు లక్షల మంది ఇంటర్న్‌షిప్‌లు చేయగా, వీరిలో అత్యధిక మంది మిక్ విద్యార్థులు పాల్గొన్నందుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించినట్టు ఆయన చెప్పారు. జాతీయ స్థాయిలో కళాశాల 26వ స్థానంలో నిలిచిందన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

రేపట్నుంచి ఏపీ అంతర్ జిల్లా రెజ్లింగ్

విజయవాడ రూరల్ : ఈనెల 3 నుంచి 5 వరకు ఏపీ స్కూల్ గేమ్స్ అంతర్‌జిల్లాల రెజ్లింగ్ పోటీలు విజయవాడ రూరల్ మండలం నున్నగ్రామంలో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న టోర్నమెంట్‌లో బాలబాలికల విభాగంలో అండర్19, అండర్14 ఫ్రీస్టైల్, బాలుర విభాగంలో అండర్ 19, అండర్ 17 గ్రీకోరోమన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నున్న జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వజ్రాల భూపాల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నున్నలోని అశోక్ ఫంక్షన్‌హాల్లో జరిగే టోర్నమెంట్‌కు మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

పేదలతో మమేకమై..

● మచిలీపట్నంలో మంగళవారం మంత్రి రవీంద్ర పర్యటనలో ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి. 28వ డివిజన్ అమృతపురంలో మంచం నుంచి కదల్లేని వృద్ధురాలికి మంత్రి పింఛన్ స్వయంగా అందజేశారు.

● డివిజన్‌లో ఇంటగి వరండాలో కట్టెల పొయ్యిపై దోసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న మహిళను పరామర్శించి ఆమె చేతివంట రుచిచూశారు.

● అదే సమయంలో అక్కడకు వచ్చిన పూసలు అమ్ముకునే సంచార జాతుల మహిళలను పలకరించి రూ. 1000 చొప్పున ముగ్గురికి ఆర్థిక సాయం చేశారు. పేదల పట్ల అభిమానం చాటుకున్నారు.

వృద్ధురాలికి పింఛన్ అందజేస్తూ..



కట్టెల పొయ్యి మీద వేసిన దోసె రుచి ఆస్వాదిస్తూ..





రోడ్లు శుభ్రం చేస్తున్న మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత తదితరులు

బందరు దశ మార్చేద్దాం

» స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 1 : బందరును సుందర పట్నంగా తీర్చిదిద్దుదామని మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరిలు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోడ్లు భవనాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు రహదారులు శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రహదారుల మంత్రిత్వశాఖ చీఫ్ ఇంజనీర్ రాకేష్‌కుమార్, నగర కమిషనర్ బాపిరాజు, మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, జనసేన నేత బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, చంద్రబాబు 2014లో సీఎంగా ఉన్న సమయంలోనే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. దానిని ప్రధాని మోదీ కొనసాగించడం ముదావహమన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మచిలీపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు మచిలీపట్నం పర్యటన ఏర్పాట్లపై పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ, మంత్రి రవీంద్రలు మంగళవారం కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఇతర అధికారులతో కలిసి వేర్వేరుగా పరిశీలించారు. స్వచ్ఛతా హి కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వస్తున్నందున ఆంధ్రా జాతీయకళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్, డంపింగ్ యార్డ్, సమావేశం జరిగే టీడీడీ కల్యాణమండపం ప్రాంతాలవద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వం అమృత్‌పథకానికి మ్యాచింగ్‌గ్రాంట్‌ను కేటాయించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ మంచినీటి కుళాయి కనెక్షన్లు నిలిచిపోయాయన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల కార్యక్రమాన్ని గాడిలో పెడతామన్నారు. స్వచ్ఛ భారత్ కింద కేంద్రప్రభుత్వం రూ2,290 కోట్లు మంజూరుచేస్తే గత ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయలేదన్నారు.

'ఆపరేషన్ బుడమేరు'కు సహకరించండి

బుడమేరు ఆక్రమణల కారణంగానే భారీవరదలో గృహాలు నీటిలో చిక్కుకుపోయాయన్నారు. ఆపరేషన్ బుడమేరులో భాగంగా ప్రభుత్వస్థలాలు, చెరువులు, కాలువల భూములను ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలన్నారు. ప్రభుత్వస్థలాల్లో పేదలు గృహాలు నిర్మాణం చేసుకుని నివసిస్తుంటే వారికి టిడ్కో ఇల్లు, లేదా ప్రత్యామ్నాయం చూపి, సంతృప్తి చెందిన తరువాతనే ఆక్రమిత స్థలాలనుంచి ఖాళీ చేయిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి గృహాలు నిర్మాణం చేసుకున్నవారు ఎంతటివారైనా, ఏపార్టీకి చెందిన వారైనా ఉపేక్షించబోమన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కాలువల భూములను ఆక్రమించుకుని గృహాలు నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్న పేదలను ఖాళీచేయించే సమయంలో ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించే అవకాశం లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, ఆ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తామని చెప్పారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ : ఏజే కళాశాల పక్కన డంపింగ్ యార్డు, ఎస్సీ కాలనీలో, రైతుబజారు, కేంద్రీయ విద్యాలయం, సుందరయ్యనగర్, లేడీస్‌క్లబ్, మూడు స్తంభాల సెంటర్, ముస్తాఖాన్‌పేటలలో మంత్రి రవీంద్ర పర్యటించి ఆ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. రవీంద్రతో పాటు కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు, డీఆర్వో చంద్రశేఖరరావు, అదనపు ఏఆర్ ఎస్పీ బీవీడీ ప్రసాద్, డీఎస్పీ సుభాని, కమిషనర్ బాపిరాజు, వ్యర్థ పదార్థాల నిపుణుడు సింగ్ తదితరులు పాల్గొన్నారు. టీటీడీ కళ్యాణ మండపంలో జరగనున్న స్వచ్ఛతా హి సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడతారన్నారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధిపై చంద్రబాబుకు నివేదిక సమర్పిస్తామన్నారు.

చెత్తతో కంపోస్టు ఎరువులు

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం డంపింగ్ యార్డు నుంచి వచ్చే చెత్త నుంచి కంపోస్టు ఎరువులు తయారు చేయవచ్చని, ఈ చెత్తను వేరే ప్రాంతాలకు తరలించి ఆదాయపు వనరులు సమకూర్చుకోవచ్చని రాష్ట్ర మునిసిపల్, పురపాలక శాఖా మంత్రి నారాయణ అన్నారు. మంగళవారం సాయంత్రం డంపింగ్ యార్డును మంత్రి నారాయణ పరిశీలించారు. డంపింగ్ యార్డు వివరాలను మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కమిషనర్ బాపిరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ హరినారాయణ, మెప్మా ఎండి తేజ్‌భరత్, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుదాకర్, మాజీ కౌన్సిలర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

● ఉదయం 10.20కి హెలీకాప్టర్‌లో ఆంధ్రాజాతీయ కళాశాలకు చేరుకుంటారు.

● 10.30 వరకు హెలీప్యాడ్ వద్ద ప్రముఖులతో మాట్లాడుతారు.

● 10.35కి ఆంధ్రా జాతీయకళాశాల రహదారిలో పారిశుధ్య పనుల్లో పాల్గొంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గం ద్వారా కోనేరుసెంటరుకు చేరుకుని పట్టణ సుందరీకరణ పనులను ప్రారంభిస్తారు.

● 10.55కు బయలుదేరి 11.05కు బస్టాండ్ సమీపంలోని టీడీడీ కల్యాణమండపానికి చేరుకుంటారు.

● మహాత్మాగాంధీజయంతిని పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తారు. అనంతరం స్వచ్ఛతా హి సేవాఅవార్డులను ప్రదానంచేసి ప్రసంగిస్తారు.

● 1.05 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని ఉండవల్లికి బయలుదేరి వెళతారు.

డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన!

» రేపట్నుంచి నగరంలో తనిఖీలు

» ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ సృజన

వన్‌టౌన్, అక్టోబరు 1 : ఇటీవల వరద ముంపుతో విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారానికి డ్రెయిన్ల వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఈనెల 3, 4 తేదీల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీ, కలెక్టర్‌తో పాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన్‌చంద్ర, ఆర్డీవో కె.చైతన్య, దక్షిణ మధ్యరైల్వే, ఇతర శాఖల అధికారులతో పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డ్రెయిన్లలో పూడికతీత, పారిశుధ్య కార్యక్రమాలతో పాటు మ్యాన్ హోల్ వద్ద తేలియాడే చెత్త తొలగింపు, సుందరీకరణ, సీసీ అప్రోచ్, ఆర్వోబీ, ఆర్యూబీల మంజూరు, నిర్మాణం, ఆక్రమణలు, తదితరాలపై సమావేశంలో చర్చించారు. వర్షాల సమయంలో నీరు సజావుగా పారేందుకు వీలుగా డ్రెయిన్లలో పూడికను యుద్ధప్రాతిపదికన తీసేందుకు రైల్వేతో పాటు వివిధ శాఖల సమన్వయంతో తీసుకోవాల్సిన అంశాలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, రైల్వే అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో రైల్వేతో ముడిపడిన ఉన్న అంశాలలో పురోగతి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. నాలుగు ప్రధాన డ్రెయిన్లపై దృష్టి సారించామని, విజయవాడ అర్బన్ పరిధిలో రైల్వే, వీఎంసీ, ఆర్అండ్‌బీ, ఏపీసీపీడీసీఎల్, రెవెన్యూ అధికారులతో ఈనెల 3, 4 తేదీల్లో రూరల్ పరిధిలో 7, 8 తేదీల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ సృజన మాట్లాడుతూ, డిసిల్టింగ్, శానిటేషన్ తదితర పనులకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) రూపొందించి దానిప్రకారం పనులు త్వరితగతిన చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, రాయనపాడు, కొండపల్లి, ఈలప్రోలు, తదితర ప్రాంతాలకు సంబంధించి ఆర్‌వోబీల ప్రతిపాదనలను సమావేశం ముందు ఉంచినట్టు తెలిపారు. సమస్యల పరిష్కారంపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. సమావేశంలో నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, రైల్వే, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, వీఎంసీ, తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ సృజన

ఉమ్మడి జిల్లాలో 236 మద్యం దుకాణాలు

కృష్ణాజిల్లా	
మచిలీపట్నం	5
గుడివాడ	7
పెడన	4
తాడిగడప	3
ఉయ్యూరు	6
మండలాల వారీగా	
అవనిగడ్డ	2
బంటుమిల్లి	3
బాపులపాడు	9
చల్లపల్లి	4
గన్నవరం	9
ఘంటసాల	3
గుడివాడ రూరల్	2
గుడ్లవల్లేరు	6
గూడూరు	2
కంకిపాడు	7
కోడూరు	3
కృత్తివెన్ను	4
మచిలీపట్నం రూరల్	3
మోపిదేవి	3
మొవ్వ	4
నాగాయలంక	3
నందివాడ	4
పామర్రు	4
పమిడిముక్కల	3
పెడన రూరల్	2
పెదపారుపూడి	2
పెనమలూరు	5
తోట్లవల్లూరు	3
ఉంగుటూరు	5
ఉయ్యూరు రూరల్	3

ఎన్టీఆర్ జిల్లా	
విజయవాడ	39
జగ్గయ్యపేట	4
కొండపల్లి	2
నందిగామ	6
తిరువూరు	4
మండలాల వారీగా	
ఎ.కొండూరు	2
చందర్లపాడు	3
జి.కొండూరు	4
గంపలగూడెం	4
ఇబ్రహీంపట్నం	3
జగ్గయ్యపేట రూరల్	4
కంచికచర్ల	5
మైలవరం	4
నందిగామ రూరల్	2
పెనుగంచిప్రోలు	5
రెడ్డిగూడెం	2
తిరువూరు రూరల్	2
వత్సవాయి	2
వీరులపాడు	2
విజయవాడ రూరల్	10
విస్సన్నపేట	4

వరాల జల్లు కురిసేనా!

(5వ పేజీ తరువాయి)

11 కిలో మీటర్ల దూరంలో 180 ఎకరాల్లో తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఉంది. వేసవిలో కాలువలకు నీరు రాకపోవడంతో ఈ ట్యాంకులో నీటి నిల్వలు తగ్గిపోయి తాగునీటి కొరత ఏర్పడుతోంది. మండలంలోని సముద్రతీరం వెంబడి గ్రామాల్లోనూ తాగునీటి చెరువులు లేకపోవడంతో తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారానే తాగునీటి అవసరాలు తీరుస్తూ వస్తున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా మచిలీపట్నం మండలంలో రూ.230 కోట్లతో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ నిధులను విడుదల చేసి ఇంటింటికీ కుళాయి పథకాన్ని అమలు చేయడంతోపాటు మండలంలో 100 నుంచి 150 ఎకరాల్లో తాగునీటి చెరువును నిర్మిస్తే తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

బీపీసీఎల్ వస్తేనే..

భారత్ పెట్రోలియం రిఫైనరీ కార్పొరేషన్‌ను మచిలీపట్నంలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం పెద్దలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే చర్చలు జరిపారు. రూ.65 వేల నుంచి 70 వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మాణం చేస్తారనే ప్రచారం జరుగుతోంది. రాజధాని అమరావతికి దగ్గరలో ఉన్న మచిలీపట్నంలో బీపీసీఎల్ ప్రాజెక్టును నిర్మాణం చేస్తే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. జాతీయ రహదారి, రైల్వేలైన్, ఓడల రాకపోకలకు బందరు పోర్టు అందుబాటులో ఉంది. ఈ రిఫైనరీ ఏర్పాటుకు మచిలీపట్నంలో భూమి కూడా ఉంది. ఈస్ట్‌కోస్ట్ ప్రాంతంలో ఆయిల్ రిఫైనరీ లేదు. మచిలీపట్నంలో ఈ రిఫైనరీని ఏర్పాటు చేస్తే రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రమే మారుపోతుంది.

ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేవు

కృష్ణాజిల్లా విడిపోయి రెండున్నర సంవత్సరాలు కావస్తోంది. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ విభాగాలకు భవనాలు లేక అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. జిల్లా పౌరసరఫరాల సంస్థ, బీసీ కార్పొరేషన్, గృహ నిర్మాణ సంస్థ, సర్వశిక్ష, డీసీవో, భూగర్భ గనులశాఖ, ఉద్యానశాఖ, రవాణాశాఖ, అటవీశాఖ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. కలెక్టరేట్‌లో ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలో ఉన్న పాత భవనాల్లో సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమశాఖ భవనాలు ఉన్నాయి. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌గా మారినా, ఇరుకుగా ఉన్న భవనంలోనే పరిపాలనను కొనసాగిస్తున్నారు. మచిలీపట్నం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల భవనాలకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పునాదులు వేసినా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి నిర్మాణాలను నిలిపివేసింది.

బందరు పోర్టు పనులను పరుగులు పెట్టించాల్సిందే!

బందరు పోర్టు పనులను 2023, మే నెలలో ప్రారంభించారు. ఇప్పటి వరకు 30శాతం మేర పనులు పూర్తయ్యాయి. అలాగే రూ. 550 కోట్ల వ్యయంతో చేపట్టిన మచిలీపట్నం మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోజుల కిందటే ఇక్కడ రెండో సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. మెడికల్ కళాశాలలో వైద్య సేవలు ప్రారంభించడానికి భవనాలు అందుబాటులో లేవు. కేవలం మొదటి, రెండో సంవత్సరం తరగతుల నిర్వహణకే ఇక్కడ భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఇలా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నెలకొన్న సమస్యలపై చంద్రబాబు మాట్లాడతారని, తమ సమస్యలకు పరిష్కారం చూపుతారని నగర ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

న్యూస్ బాక్స్

రక్తదానంతో ప్రాణదానం

గన్నవరం, అక్టోబరు 1 : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరు రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. 30 మంది రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ గన్నవరం బ్రాంచ్ చైర్మన్ చిన్ని మాధవి సొసైటీ జిల్లా చైర్మన్ టీఎస్ఎస్ బాలాజీ కార్యదర్శి భవిరి శంకరనాథ్, కోశాధికారి రామ్ బాలాజీ, ఎయిర్‌పోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి

కష్టకాలంలో ఎన్టీఆర్ భరోసా..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కష్టకాలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఓ పేదరాలిని ఆదుకుంది. వేలేరుకు చెందిన శ్రీకాకుళపు అన్నమ్మ తీవ్ర అనారోగ్యంతో విజయవాడలో చికిత్స పొందుతోంది. టీడీపీ నేత వాహనాన్ని ఏర్పాటు చేయడంతో సచివాలయ సిబ్బంది మంగళవారం విజయవాడ వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు. పింఛన్ నగదు తెచ్చి ఇవ్వడంతో ఆమె కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



మహిళ మృతదేహం గుర్తింపు

ఏడాదిన్నర పాప కోసం గాలింపు

విజయవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : బెంజ్‌సర్కిల్‌కు సమీపాన ఉన్న స్క్రూబ్రిడ్జి పైనుంచి పిల్లలతో కలిసి బందరు కాల్వలోకి దూకిన మహిళ మృతదేహాన్ని ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గుర్తించాయి. మూడు రోజుల క్రితం తిరుమల సుధారాణి తన ఇద్దరు పిల్లలతో కాల్వలోకి దూకిన విషయం తెలిసిందే. అదేరోజు చిన్నకుమార్తె బ్లెస్సీ మృతదేహం లభ్యమైంది. మంగళవారం సుధారాణి మృతదేహాన్ని యనమలకుదురు దాటిన తర్వాత అవనిగడ్డ వైపు వెళ్లే కాల్వలో గుర్తించారు. పెద్దకుమార్తె జాస్సీ కోసం బృందాలు గాలిస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535	



అన్న క్యాంటీన్‌కు రూ. లక్ష విరాళం

లబ్బీపేట, అక్టోబరు 1: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లు ప్రారంభించడం పేదల పాలిట ఒక వరం అని ఆపన్నహస్తం ఛైర్మన్ డాక్టర్ ఉలవపల్లి గంగాధర్ రెడ్డి అన్నారు. అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పేదల ఆకలి గురించి తెలుసని, అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్ ప్రారంభించారని అన్నారు.



పింఛన్లపై మాట్లాడే హక్కు టీడీపీదే

21వ డివిజన్‌లో పెన్షన్ పంపిణీలో ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, అక్టోబరు 1: పింఛన్‌పై మాట్లాడే హక్కు టీడీపీకే వుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంక 21వ డివిజన్‌లో మంగళవారం పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ పథకం మొదలైందన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్ పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పింఛన్ గురించి మాట్లాడే హక్కు ఒక్క టీడీపీకే వుందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ రూ.35లతో ప్రారంభించారని, ఇప్పుడు చంద్రబాబు రూ.4 వేలు ఇస్తున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా సంవత్సరానికి రూ.250లు కాకుండా ఎన్నికల్లో చెప్పిన విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకేసారి రూ.వెయ్యి పెంచి ఇచ్చామని చెప్పారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, వాస్తవాలను ప్రజలు అర్థం చేసుకొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి

కన్నుల పండువగా పింఛన్లు పంపిణీ

సత్యనారాయణపురం: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం సెంట్రల్‌లో మంగళవారం కన్నుల పండువగా సాగింది. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు బావాజీపేట, దుర్గాపురంలో మంగళవారం ఉదయం 6గంటల నుంచి డోర్ టూ డోర్ పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, దాసరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడులో యూనిట్ ఇన్‌చార్జి దెందుకూరి మురళీకృష్ణంరాజు పింఛన్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గుర్రం సుబ్బారావు, బోను శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్‌కాలనీలో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, సచివాలయం సెక్రటరీల ఆధ్వరంలో పింఛన్ల పంపిణీ జరిగింది.

గుణదల: రాష్ట్రంలో ఆర్థిక లోటు తీవ్రంగా ఉన్నప్పటికీ సంక్షేమ ఫలాలు పేదలకు అందించగల సమర్థుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉందయం 6 గంటలకే తాము లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, జనసేన అధ్యక్షుడు బాడిత శంకర్, పాల్గొన్నారు.

రాణిగారితోట: 18వ డివిజన్‌లో మంగళవారం పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శ్రీను, వెంకటరమణ, బలగాని శ్రీను పాల్గొన్నారు.

పాయకాపురం: 64వ డివిజన్ కండ్రిక కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ పింఛన్ సొమ్ము అందజేశారు.

కాళీమాత ఆలయంలో...

దసరా శరన్నవరాత్రి మహోత్సవ బుక్‌లెట్ విడుదల

కృష్ణలంక, అక్టోబరు 1 : త్రిశక్తి పీఠంలోని కాళీమాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవ బుక్‌లెట్‌ను మంగళవారం సాయంత్రం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్‌లు మాట్లాడుతూ దసరా నవరాత్రులు తొమ్మిదిరోజుల పాటు వివిధ అలంకారాలలో అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక కుంకం పూజలు, సామూహిక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లయోలాలో గాంధీజీ జయంతి



మహాత్మాగాంధీ సినిమా చూస్తున్న విద్యార్థులు

భారతీనగర్, అక్టోబరు 1 : ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం గాంధీజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి పాల్గొని విద్యార్థులకు గాంధీజీ జీవిత చరిత్రను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పీఐసీ మేకే క్లబ్‌లో మేకింగ్ ఆఫ్ మహాత్మా గాంధీ సినిమా ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ మహేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ కాండీ డి కూనా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వన్‌టౌన్, అక్టోబరు 1: భవానీపురం పరిధిలోని 11కేవీ గాంధీబొమ్మ ఫీడర్‌లైన్ల మరమ్మతుల క్రమంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ ఈఈ పి. రవీంద్ర బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, కోళ్లఫారం రోడ్డు, డాల్ఫిన్ బార్ రోడ్డు, ఐవోసీ పెట్రోల్ బంకు రోడ్డు, చర్చి రోడ్డు, గాంధీబొమ్మ రోడ్డు వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.









పొట్టి శ్రీరాములు కాలేజీ ఇంజనీరింగ్ విద్యార్థుల ర్యాలీ, ప్రభుత్వాసుపత్రిలో శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

స్వచ్ఛతా హి సేవపై అవగాహన ర్యాలీ

వన్‌టౌన్, అక్టోబరు 1: కొత్తపేటలోని పొట్టిశ్రీరాములు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వీధుల్లో అవగాహన కల్పిస్తూ పంజా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి చిట్టా అమర సుధీర్, ట్రెజరర్ కాజా రాఘవయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, పీవో శ్రీకాంత్ రెడ్డి, కో ఆర్డినేటర్స్ నవీన్ కుమార్, డాక్టర్ పి.నరేష్, విజయ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో...

ప్రభుత్వాసుపత్రి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటించాలని కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. నాగశేషమ్మ, పీవో కె. శ్రీదేవిలు అన్నారు. గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ విద్యార్థినులు ప్రభుత్వాసుపత్రిలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాస్తిక కేంద్రంలో..

పటమట: బెంజిసర్కిల్ వద్ద నాస్తిక కేంద్రంలో మంగళవారం జరిగిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ సమరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న భారతదేశం సాకారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ- ఎన్టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ వ్యాసరచన పోటీల విజేతలకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేశారు. మహిళా మండలి కార్యదర్శి రశ్మి పాల్గొన్నారు.



నాస్తిక కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ వ్యాసరచన పోటీల విజేతలు

రేపటి నుంచి శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హిందూ హైస్కూల్ కమిటీ

వన్‌టౌన్, అక్టోబరు 1: లోక కళ్యాణార్థం ఈనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కొత్తపేట కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో కన్యకా పరమేశ్వరి విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం నిర్వహిం చనున్నట్లు కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్ర శేషయ్య, కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్‌లు తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో కమిటీ ప్రతినిధులు శ్రీరుద్ర సహిత ద్విశత చండీయాగం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు టి. శేషయ్య మాట్లాడుతూ చండీ హోమంతో పాటు నిత్యం రుద్ర, శ్రీరామ, ఆంజనేయ, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మహాలక్ష్మి, మృత్యుంజయ, మన్యసూక్త, నవగ్రహ హోమాలు, కుంకుమార్చన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. విజయదశమి రోజున పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తి జరుగుతాయన్నారు. కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాల ప్రాంగణంలోని శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానం వేదికగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి హరగోపాల్, కమిటీ సభ్యులు దుగ్గిరామ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, పాల్గొన్నారు.

ఘనంగా తెరేసమ్మ దేవాలయ ప్రతిష్ఠ



నూతన దేవాలయాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్లు

పటమట, అక్టోబరు 1: సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ పరిధిలోని యనమలకుదురు గ్రామంలో మంగళవారం పునీత తెరేసమ్మ దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, గుణదల క్రైస్తం రెక్టర్ ఫాదర్ విలియం జయరాజ్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. సమష్టి దివ్య బలిపూజను క్రైస్తవమత గురువులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి జయరాజు తనయుడు జీవన్‌కుమార్ బృందంచే ప్రదర్శించిన ధనవంతుడు బీద లాజరు క్రైస్తవ నాటకం భక్తులను ఆకట్టుకుంది.

ఖబరస్తాన్‌లో వరద నీరు తొలగింపు

పాయకాపురం, అక్టోబరు 1 : బుడమేరు వరదల కారణంగా పాయకాపురంలోని నూరేచమన్ ఖబరస్తాన్‌లో వరద నీరు నిలిచి అంత్యక్రియలకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని సెంట్రల్ టీడీపీ మైనార్టీ నేతలు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి మంగళవారం తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి మోటార్లను ఏర్పాటు చేసి వరదనీరు బయటకు తోడించి సమస్యను పరిష్కరించారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ : పూజిత వాటర్ ఫ్రంట్ అపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. అజిత్‌సింగ్‌నగర్‌లోని లూనా సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్స్ ప్రెసిడెంట్ ముళ్లపూడి భగవాన్ బాధితులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో రూ. లక్షన్నర విలువ గల చీరలు, దుప్పట్లు, టవల్స్, లుంగీలు కొనుగోలు చేసి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలరాం, జ్యోతిర్మయి, భానుమూర్తి, కేశవర్ధన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ది పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో

అజిత్‌సింగ్‌నగర్ : ది పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త చుక్కపల్లి అరుణ్‌కుమార్ బాధితులకు దుస్తులు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు తమ వంతుగా రూ. 4 లక్షలు విలువ చేసి కిట్లను 1100 మందికి అందజేసినట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు అలమండ ఎల్లారావు, కోశాధికారి జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న భగవాన్



కిట్లు అందజేస్తున్న చుక్కపల్లి అరుణ్‌కుమార్



బాధితులకు దుస్తులు పంపిణీ

ఎంకే బేగ్ పాఠశాలకు జోయాలుక్కాస్ సాయం

అజిత్‌సింగ్‌నగర్ : స్థానిక ఎంకే బేగ్ పాఠశాలకు జోయాలుక్కాస్ వ్యాపార సంస్థ మంగళవారం పాఠశాలకు ఉపయుక్తమైన పలు ఉపకరణాలను అందజేసింది. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుకు పాఠశాలకు కంప్యూటర్‌లు, మైక్‌సెట్, కూలర్‌లు, ఇనుప ర్యాక్‌లు, సీలింగ్ ఫ్యానులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ...

మధురానగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ క్లబ్ ద్వారా 100 మంది వరద బాధితులకు దుప్పట్లు, లుంగీలు, టవల్స్, చాపలు పంపిణీ చేశారు. మధురానగర్ గౌతమ పాఠశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్ గద్దె శేషగిరి, క్లబ్ అధ్యక్షుడు లయన్ కె. రవికుమార్, జీఎల్‌టీ కో ఆర్డినేటర్ లయన్ ఎస్‌వీవీఎస్‌వీ ప్రసాద్, వైస్ చైర్మన్ లయన్ శ్రీనివాస రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగారూ... మా గోడు వినండి

- అభివృద్ధి అంటూ యూజీడీని అధ్వానం చేసిన కార్పొరేటర్
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత కనిపించని వైనం
- 17, 18 డివిజన్లలో పొంగి పొర్లుతున్న డ్రెయినేజీ
- సమస్య పరిష్కారం కోసం టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ
- ఎమ్మెల్యేకు డివిజన్ల వాసుల వేడుకోలు


రాణిగారితోట, అక్టోబరు 1 : రాణిగారితోట 17, 18 డివిజన్లలో ఏ రోడ్డు చూసినా పొంగి పొర్లుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలే దర్శనమిస్తాయి. పొంగి పొర్లుతున్న డ్రెయినేజీలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేటర్‌గా గెలిచిన వైసీపీ నాయకుడు వెంకట సత్యనారాయణ అభివృద్ధి అంటూ డివిజన్‌లో దాదాపు అన్ని రోడ్లలో యూజీడీ డబల్ పైప్‌లైన్ వేసి ఇక డ్రెయినేజీ సమస్య ఉండదని అవసరానికి మించి అనవసరంగా సీసీ రోడ్లు కూడా వేశారు. అయినా గతంలో కంటే ఎక్కువగా ప్రతి రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళలు అని తేడా లేకుండా డ్రెయినేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీనికి తోడు సైడ్ కాల్వలు కూడా పూడుకుపోవడంతో రోడ్లపైకి వచ్చిన యూజీడీ వ్యర్థాలు, మురికి నీరు సైడ్ కాల్వల్లో నిల్వ ఉండి సమస్య మరింత జఠిలంగా మారింది. ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకెళదామంటే ఆయన అసెంబ్లీ ఎన్నికల తరువాత నుంచి కనిపించపోవడంతో ఎవరికి చెప్పాలో అర్థంకాక స్థానికులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో స్థానికంగా ఉన్న తెలుగుదేశం నాయకుల చుట్టూ తిరుగుతూ తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. వీరి ఆవేదన చూడలేని నాయకులు సంబంధిత అధికారులను సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. అయితే అధికారులు కూడా శాశ్వత పరిష్కారం చూపలేకపోవడంతో ప్రతిరోజు టీడీపీ నాయకులు ఇళ్ల చుట్టూ తిరుగుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతున్నారు.



సంగుల పేరయ్య వీధిలో పొంగి పొర్లుతున్న యూజీడీ

సహాయం చేయలేక పోతున్న నాయకులు

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లే విషయంలో స్థానిక టీడీపీ నేతలు సహాయం చేయలేకపోతున్నారని కారణం అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. కార్పొరేటర్ కనిపించక, ఎమ్మెల్యేకు విషయం తెలియక ఈ సమస్య ఏవిధంగా పరిష్కారం అవుతుందని ఆ డివిజన్ వాసులు అంటున్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాత్రమే తమ సమస్యను పరిష్క రించగలరని, కాస్త ఎమ్మెల్యేగారూ మా గోడు వినండి, మా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి అంటూ స్థానికులు కోరుతున్నారు.



17వ డివిజన్ తారకరామ నగర్

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777, 99854 11733, 99854 09286, 99854 09587

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194249

PEST CONTROL

» మహిమ పెస్ట్ కంట్రోల్-వాసన రానిది మరకలు పడనిది ఐదు సంవత్సరాలు వారంటీ బల్లులు బొద్దింకలకి 6 నెలలు. Ph:94949 60415, 94949 60674.
AJB -194997

WANTED

» న్యాయవాది గారి ఆఫీసు నందు సిస్టమ్ మీద వేగంగా తెలుగు / ఇంగ్లీషు టైపింగ్ చేయగల లోయర్ పాసైన Female కావలెను. సంప్ర. 9490962222
AJB-194028

» DTDC Bhavanipuram Office నందు పనిచేయుటకు Courier Boys and Office Assistant Immediate గా కావలెను. Age Limit below 50 Years. సెల్ : 92995 52535
AJB-194247

» WANTED TEACHERS : English - Classes (1 to 5) Salary 10k to 15k, English - Classes (6 to 8) Salary 15K to 20k, English - Classes (8 to 10) Salary 25k to 30k. We require experienced and dedicated faculty. Contact No. 79811 80033, 91767 67329
AJB - 4418

EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-194069

» ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా DEGREE, P.G, MBA, MCA, AUTHORIZED STUDY & EXAM CENTER. డైరెక్టు 10th, ఒకే సం.లో ఇంటర్. భవ్య అకాడమి (Since : 2001) : 97053 35678.
AJB-82

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ. 290/- ప్రతి అదనపు లైనుకు రూ. 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123,132, 143
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.535

నేటి నుంచి జగ్గయ్యపేటలో బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్య పేట, అక్టోబరు 1: తెలంగాణ ప్రాంతంలో జరిగే బతుకమ్మ ఉత్సవాల మాదిరిగానే జగ్గయ్యపేటలోనూ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు వెంకట అనంతరాజా, తులసీ సుబ్బారావు,ఉపాధ్యక్షులు నోముల శివకుమార్, కోశాధికారి యర్రా శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం సాయంత్రం గం.6లకు పెద్ద రామాలయంలో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమై , 10వ తేదీ గురువారం సద్దుల బతుకమ్మతో శ్రీ రేణుక పరమేశ్వరీ అమ్మ వారి దేవస్థానంలో ఉత్సవాలు ముగియనున్నాయన్నారు. మహిళలు, చిన్నారులతో కోలాట నృత్యాలు నిర్వహిస్తామని, కార్యక్రమం ముగిశాక ప్రసాద వితరణ చేస్తామన్నారు. అనంతరం బతుకమ్మల నిమజ్జనం చేస్తామని వివరించారు. మహిళలంతా బతుకమ్మ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

న్యాయాధికారి హాస్టళ్ల సందర్శన

తిరువూరు,అక్టోబరు1: పట్టణంలోని బీసీ బాలురు, బీసీ బాలికల హాస్టల్స్‌ను ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి మోతిలాల్ మంగళవారం సందర్శించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సూచనల మేరకు జడ్జి ఆయా హాస్టల్స్ సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. బీసీ బాలుర హాస్టల్‌కు సీలింగ్ ఫ్యాన్లు అందించారు. జడ్జివెంట బార్ అసోషియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.

కరాటేలో నాగార్జున విద్యార్థిని ప్రతిభ

తిరువూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలో స్థానిక నాగార్జున హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని కె.జెస్సీ ప్రథమ స్థానం సాధించి, బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ యజమాన్యం వేమూరి నాగేశ్వరరావు, కె.నరసింహారావు, ఆర్.సురేష్, తదితరులు విద్యార్థినిని అభినందించారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

వత్సవాయి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం చిల్లకల్లు నుంచి వైరా వెళ్లే రహదారిలో ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అతివేగం మంచిది కాదని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

విస్సన్నపేట: గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎలక్షన్ నేపథ్యంలో ప్రయివేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రయివేటు స్కూల్స్ అండ్ కళాశాలల్లో ఉచితంగా దరఖాస్తులు పంపిణీ చేసి గ్రాడ్యూయేట్స్‌కు అవగాహన కల్పించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు శివ సత్యనారాయణ, పాల్గొన్నారు.

సీపీఐకి రాజీనామాలు

విస్సన్నపేట: విస్సన్నపేట సీపీఐ నాయకులు మంగళవారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు మే కల కుమారి, సీనియర్ నాయకులు శోభనాచలం, సు బ్బారావులు ఆపార్టీకి రాజీనామాలు చేసినట్టు విలేకర్ల సమావేశంలో తెలిపారు. పార్టీ నాయకులు ఎం.త్యాగరాజు, షేక్ నాగుల్ మీరా, తూము కృష్ణయ్యల వ్యవహార శైలి నచ్చక పార్టీకి దూరమవుతున్నట్లు చెప్పారు.

యూటీఎఫ్ కార్యవర్గం

ఎ.కొండూరు: ఎ.కొండూరు మండల యూ టీఎఫ్ నూతన కౌన్సిల్ ఎన్నిక నిర్వహించినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య తెలిపారు. ఎ.కొండూరు మండల అధ్యక్షుడుగా బీవీ, దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఇస్సాక్, గౌరవాధ్యక్షుడుగా శ్రీరాములు ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు.

రేపు చిల్లకల్లులో ప్రజాదర్బార్

జగ్గయ్యపేట: చిల్లకల్లులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం గం.10ల నుంచి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో మండల ప్రజల కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు జగ్గయ్యపేట ఎంపీడీఓ ఎం. రమేష్‌బాబు చెప్పారు. ప్రజలు ఈ అవకాశం వినియోగించుకుని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు.

విద్యార్థిని కనపడటం లేదని ఫిర్యాదు

జగ్గయ్యపేట: పట్టణంలో కాకానినగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని కనిపించడంలేదని బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. బాలిక (16) కళాశాలకు వెళ్లి రాలేదని, ఒక యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

వ్యాపారిపై అసభ్య ప్రవర్తన కేసు

జగ్గయ్యపేట: మహిళలపై అనుచితంగా ప్రవర్తించిన వ్యాపారులు కాశీ విశ్వనాథ్ ఆయన సోదరుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు, తెలిపారు. క్రిస్టియన్‌పేటకు చెందిన శ్యాం తన ఇంటి వద్ద మహిళలపై అసభ్యంగా మాట్లాడారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

జి.కొండూరు: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన జి.కొండూరులోని పంచాయతీ పారిశుధ్య కార్మికులను కార్యదర్శి వై.బసవలింగేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు.సర్పంచ్ మండల అరుణ, టీడీపీ నాయకురాలు అంకెం ఇందిరా ప్రియదర్శిని, కార్యదర్శి బసవలింగేశ్వరరావులు వారిని దుశ్శాలువాలతో సత్కరించారు.



కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ అరుణ

మైలవరం: ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం మైలవరం బస్టాండ్ పరిసరాలను స్వచ్ఛతా హి సేవలో భాగంగా శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపల్ వి.రంగారావు, డాక్టర్ వి.ఫణికుమార్,పాల్గొన్నారు.



అనుమంచిపల్లి వద్ద ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



ఇబ్రహీంపట్నంలో కార్మికుల ఆందోళనలు



కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ..

ఇసుక కొరత .. కార్మికుల ఆందోళన

- భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి
- ఇసుక తోలుకునేందుకు అనుమతులు ఇవ్వాలి
- ప్రజాప్రతినిధులకు, అధికారులకు కార్మికుల వినతీపత్రాలు

జగ్గయ్యపేట, అక్టోబరు 1: నెల రోజులుగా ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, సీపీఐ నేత శివాజీలు ఆరోపించారు. మంగళవారం కార్మికులతో కలిసి వారు అనుమంచిపల్లి స్టాక్ యార్డు వద్ద, జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. స్టాక్‌యార్డు వద్ద టిప్పర్లు తప్ప ట్రాక్టర్లు ఉండటం లేదన్నారు. ఆన్‌లైన్‌లో ఎప్పుడు బుక్ చేద్దామన్న నో స్టాక్ అని సందేశం వస్తుందని ఆరోపించారు. భవన యజమానులకు ఇసుక దొరక్కపోవటంతో పనులు సాగటం లేదని, తాము ఖాళీగా ఉండాల్సి వస్తుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా స్టాక్ యార్డుల వద్ద ఇసుకకు డబ్బులు కట్టి తీసుకువెళ్లే విధంగా పాత విధానాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోనూ, ఎమ్మెల్యే కార్యాలయంలోనూ సిబ్బందికి వినతీ పత్రాలు అందచేశారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సంక్షేమ బోర్డు నుంచి ప్రతి భవన నిర్మాణ కార్మికునికీ రూ.15 వేలు చొప్పున అందించి ఆదుకోవాలని ఐఎఫ్‌టీయు అండ్ బీసీడబ్ల్యుయు జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక లేక అనేక మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం సైతం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఉచిత ఇసుక ఇవ్వకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈకార్యక్రమంలో ఎం.జానీస్, సాంబశివరావు, ఆంజనేయులు, మాణిక్యాలరావు, నాగరాజు విజయ్‌కుమార్, రాంబాబు, పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల రూరల్: రాష్ట్రంలో 35 లక్షల కార్మికుల కుటుంబ గోడు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని ఎన్టీఆర్ జిల్లా భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షుడు, ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి జి.హరికృష్ణ అన్నారు. ఉచిత ఇసుక అమలు చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ, బీసీడబ్ల్యుయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సాగర్ కాలువ వల్ల వరద ముంపుకు గురైన జంగాల కాలనీ వాసులకు ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ సహకారాలను అందించాలన్నారు. ఈకార్యక్రమాల్లో మద్రిపూడి పూర్ణచంద్రరావు, ఎల్.ఆంజనేయులు కంభంపాటి శ్రీను, బండారు శ్రీను, బడేటి దాసు, మాధవ, పులి స్వాతి, విజయలక్ష్మి, కవిత, మదర్ పాల్గొన్నారు.

వీరులపాడులో..

వీరులపాడు: ఇసుక క్వారీలు తెరిపించాలని ఐఎఫ్‌టీయు బీసీడబ్ల్యుయు ఆధ్వర్యంలో జుజ్జూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: ఇసుక తోలకాలపై ఆంక్షలు విధించడంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఇసుక తోలకాలకు అనుమతి ఇవ్వాలని కార్మికులు తహసీల్దార్ లక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఇసుక లేకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని, ఈ వృత్తిమీద ఆదారపడ్డ సుమారు 18 విభాగాల కార్మికులు పనులు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, మండలంలోని వాగుల నుంచి ఇసుక తోలుకునేందుకు భవన నిర్మాణ దారులకు కూపన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరుతూ టీడీపీ కౌన్సిలర్లు నాళ్లా సురేంద్ర, షేక్ అబ్దుల్‌హుస్సేన్ పలువురు భవన నిర్మాణ కార్మికులు వినతిపత్రం అందించారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంచేందుకే సైన్సు సంబరాలు

తిరువూరు, అక్టోబరు 1: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకే జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుము కి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్టు జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. మంగళవా రం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మండలస్థాయి చెకుముకి ట్యాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించాలన్నారు. చెకుముకి సైన్సు సంబరాల్లో 19 టీమ్‌లు పాల్గొన్నాయన్నారు. పోటీలో ప్రభుత్వ స్కూల్ విభాగంలో కె.లావణ్య టీమ్(జడ్పీహైస్కూల్, మునుకుళ్ళ), కె.చాందిని టీమ్(జడ్పీహైస్కూల్ ముష్టికుంట్ల),ప్రయివేటు స్కూల్స్ విభాగంలో యం.వీక్షిత టీమ్(నాగార్జున స్కూల్),టి.హన్సిక టీమ్(నాగార్జున స్కూల్) ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జెవివి నాయకులు హరికృష్ణ, శీనయ్య, సుదర్శన్, ఉషారాణి, భరతకుమారి పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: పెదకొమెర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి సైన్స్ సంబరాలు మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు.జేవీవీ ప్రతినిధులు కె.శేషగిరిరావు, కొండలరావు, సైదులు, కోటేశ్వరరావు, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో మద్దులపర్వ మోడల్ స్కూల్, కూనపరాజుపర్వ జడ్పీ హైస్కూల్, గీతాంజలి హైస్కూల్, నారాయణ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు జేవీవీ జిల్లా కమిటీ సభ్యుడు జి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. డాక్టర్ శ్యామ్ సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట : మండల స్థాయిలో చెకుముకి సైన్సు సంబరాల్లో చిల్లకల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు షేక్ కరిష్మా, ఉప్పు హారిక, మారే పల్లి ఆలేఖ్యలను విజయం సాధించి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వారిని హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, చెకుముకి మండల సైన్సు ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ జె.సుధానంద్‌లు అభినందించారు.

నేడే చూడండి
అప్సర సినిమా



రోజూ 4 ఆటలు :
11-15AM, 2-40PM,
6-15PM, 9-40PM
www.justickets.in
www.bookmyshow.com

GRAND GALA RELEASE
FROM TODAY
at NAVRANG A/c



(IN ENGLISH) DAILY 4 SHOWS
11-30AM, 3-00PM,
6-30 PM, 9-30PM
ADVANCE BOOKING OPEN
ONLINE " BOOK MY SHOW"

డోర్నకల్ టు విజయవాడ రైలు పునరుద్ధరించాలి

- ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

ఇబ్రహీంపట్నం: కరోనా సమయంలో రైల్వే అధికారులు నిలిపివేసిన రైలు నంబరు 07755 డోర్నకల్ టు విజయవాడ ప్యాసింజర్ రైలును తిరిగి పునరుద్ధరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కోరారు. మంగళవారం రైల్వే సమస్యలపై విజయవాడలోని కలక్టరేట్ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా ప్రత్యేక అధికారులు ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే వంసత మైలవరం నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను ప్రస్తావించారు. ఈనెల 4న నిర్వహించనున్న రైల్వే బోర్డు జనరల్ మేనేజర్ సమావేశంలో ప్రస్తావించే అంశాలను ఆయన గుర్తు చేశారు. కొండపల్లి, ఈలప్రోలు, రాయనపాడు, గొల్లపూడి తదితర ప్రాంతాల్లో అండర్‌పాస్‌ల నిర్మాణానికి రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. రాయనపాడు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల వల్ల, కొత్త ట్రాక్స్ ఏర్పాటు వల్ల ఏర్పడుతున్న డ్రెయినేజీ సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. తాగునీటి పైపులైన్ కూడా దెబ్బతిన్నాయన్నారు. రాయనపాడు స్టేషన్‌లో గోల్కొండ, శాతవాహన రైళ్లకు స్టాపులు ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల పశ్చిమ కృష్ణలోని ఐదు నియోజకవర్గాల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. విజయవాడ మెయిన్ రైల్వే స్టేషన్ రద్దీని నివారించవన్నారు.



ఎంపీతో ఎమ్మెల్యే వసంత

పంటపొలాల పరిశీలన

ఎ.కొండూరు: సీజనల్‌గా వచ్చే చీడ పీడల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూడీ డైరెక్టర్ టి. మాధవిలత అన్నారు. మంగళవారం కోడూరులో పంట పొలాలను ఆమె పరిశీలించారు.తిరువూరు ఏడీఎ కెనడీ, హెచ్‌వో నరేంద్ర, ఏవో టీప్పుసుల్తాన్ , సిబ్బంది పాల్గొన్నారు.

అక్కపాలెం(తిరువూరు): వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, జిల్లా వనరులకేంద్రం ఉప సంచాలకులు టి.మాధవీలత సూచించారు.

విజ్ఞాన్‌లో బతుకమ్మ సంబరాలు

జగ్గయ్యపేట: పట్టణంలో విజ్ఞాన్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు అన్ని సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని సుధారాణి చెప్పారు.

తిరువూరు: స్థానిక శ్రీనిధి టెక్నో స్కూల్‌లో ముందస్తుగా దసరా, బతుకమ్మ సంబరాలను మంగళవారం నిర్వహించారు.

జగ్గయ్యపేట:గండ్రాయి మెయిన్ మండల పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం నేలవెల్లి రమేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

వత్సవాయి: చినమోదుగుపల్లి పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగ్గయ్యపేట, అక్టోబరు 1: జగ్గయ్యపేట సమీపంలో జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై, హైదరాబాద్‌లోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన తాళ్లూరి గోపాలకృష్ణను ఎమ్మెల్యే తాతయ్య, వారి సోదరులు సాయిప్రసాద్, చినబాబులు మంగళవారం పరామర్శించారు. అన్నివిధాలుగా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

జగ్గయ్యపేట: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆర్టీసీలో రిటైరైన పిల్లి ముత్తయ్య (83), తాళ్లూరి పెరుమాళయ్య (82) లను యూనియన్ నేతలు చినమీరా, చలపతిరావు, సీతారాం తదితరులు సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి విజయవాడ రూరల్ గొల్లపూడి గ్రామానికి చెందిన అలపాటి సాంబశివరావు - విజయలక్ష్మి దంపతులు అంకమ్మ అమ్మవారి వెండి తాపడం తయారీ నిమిత్తం రూ.50 వేలను , తెలంగాణలోని ఖమ్మం పట్టణం మామిళ్లగూడేనికి చెందిన మద్దుకూరి శ్వేతా చౌదరి నిత్యాన్నదాన పథకానికి రూ.15,116లు విరాళంగా ఆలయ ఇనిస్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

గాంధీజీ విగ్రహావిష్కరణ

విస్సన్నపేట: వేమిరెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణలో వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు పల్లపోతు చక్రవర్తి వితరణతో ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని క్లబ్ జిల్లా గవర్నర్ కె.ఎల్.వి సతీష్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ప్రభుత్వాసుపత్రుల్లో టేబుల్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం హైస్కూల్స్‌లో సిమెంట్ బల్లలు, విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. నడిపల్లి నీలిమా, రంగిశెట్టి మధు, కుక్కడపు నాగేశ్వరరావు, కుక్కడపు సతీష్‌కుమార్, దారా శ్రీనివాసరావు, హెచ్.ఎంలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

జగ్గయ్యపేట: న్యాయవాదుల చట్టంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సవరణలను నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి మంగళవారం కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఎం.కృష్ణయ్య, కె శ్రీనివాసరావు, బి.వెంకటరామయ్య, పి.ఎస్ శ్రీనివాస్, హనుమంతురావు పాల్గొన్నారు.

వసతిగృహం ఆకస్మిక తనిఖీ

విస్సన్నపేట: కొండపర్వలోని గిరిజన గురుకుల బాలికల వసతిగృహాన్నిగిరిజన గురుకులాల డిప్యూటి సెక్రటరీ (అకాడమిక్) కె.సుభాషిణి రాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు

గ్రాడ్యుయేట్ ఓటర్లను చేర్పిద్దాం: తన్నీరు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో కనీసం 5వేల మంది గ్రాడ్యుయేట్‌లను ఓటర్లగా నమోదు చేయించాలని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.గౌతమ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194249

PEST CONTROL

మహిమ పెస్ట్ కంట్రోల్–వాసన రానిది మరకలు పడనిది ఐదు సంవత్సరాలు వారంటీ బల్లులు బొద్దింకలకి 6 నెలలు. Ph:94949 60415, 94949 60674.
AJB -194997

EDUCATION

శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-194069

ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా DEGREE, P.G, MBA, MCA, AUTHORIZED STUDY & EXAM CENTER. డైరెక్టు 10th, ఒకే సం.లో ఇంటర్. భవ్య అకాడమి (Since : 2001) : 97053 35678.
AJB-82

WANTED

WANTED TEACHERS : English - Classes (1 to 5) Salary 10k to 15k, English - Classes (6 to 8) Salary 15K to 20k, English - Classes (8 to 10) Salary 25k to 30k. We require experienced and dedicated faculty. Contact No. 79811 80033, 91767 67329
AJB - 4418

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 220/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737



వృద్ధునికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే వసంత



పెన్షన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య



పింఛన్ నగదు అందిస్తున్న ముప్పిడి నాగేశ్వర రెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

హామీల అమలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

జి.కొండూరు, అక్టోబరు 1: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. కట్టుబడిపాలెంలో మంగళవారం ఆయన సామాజిక భద్రతా పింఛన్లను అవ్వాతాతలకు అందించారు. జి.కొండూరు మండలంలో 8,661 మంది లబ్ధిదారులకు రూ.3.67 కోట్ల సామాజిక భద్రతా పింఛన్లు అందజేశారు. బీజేపీ, జనసేన నియోజవర్గాల ఇన్‌చార్జిలు నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల), అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, పటాపంచల నరసింహారావు, కొల్లి నాగేశ్వరరావు, నెల్లూరు లీలా శ్రీనివాసరావు, యరమల సంజీవ రెడ్డి, రవి, గరిమెళ్ల శ్రీనివాసరావు, గరిమెళ్ల గోపాలరావు, డి.పూర్ణచంద్రరావు, సుకవాసి శ్రీహరి, ఈమని మురళీకృష్ణ, ఎంపీడీవో పి.అనురాధ పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణంలోని ఒకటో వార్డులో ఎమ్మెల్యే శ్రీరాం తా తయ్య ,కౌన్సిలర్ సామినేని మనోహర్‌తో కలిసి మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం అనుమంచిపల్లి గ్రామంలో టీడీపీ నేత యానాల గోపీచంద్, మండల సమైక్య అధ్యక్షురాలు గద్దె రాజ్యలక్ష్మిల తో కలిసి ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. మిట్ట గూడెంలో కౌన్సిలర్ గొట్టి నాగరాజు, చెరువుబజార్‌లో కౌన్సిలర్ బుజ్జి పింఛన్లు పంపిణీ చేశారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు : కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సమాజిక పింఛన్లు మండలంలోని 21 గ్రామాల్లో 95 శాతం పంపిణీ చేసినట్టు ఎంపిడీవో రవికాంత్ తెలిపారు. మంగళవారం ఉదయంనే సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు స్థానిక టీడీపీ, కూటమి నేతలతో కలసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు.టీడీపీ నేతలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలో ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ నగదును టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ కొండపల్లి బాబు, మాజీ సర్పంచ్ జానలపాటి వేణు గోపాల్ రెడ్డి, పోతురాజు బాలకృష్ణ, చాట్ల చందా పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. పట్టణంలోని 20 వార్డుల్లో ఉదయం నుంచి వార్డు సచివాలయం సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్ళి పింఛన్లు అందజేశారు. పట్టణ పరిధిలో 95 శాతం, మండలం పరిధిలో 97 శాతం పింఛన్లు పంపిణీచేశారు.

గొల్లపూడిలో..

గొల్లపూడి: విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి వేమవరం కాలనీలో హిమోఫోబియాతో బాధపడుతున్న చిన్నారులు యార్లగడ్డ ఉదయ్, యార్లగడ్డ సంతోష్‌లకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును టీడీపీ ఎస్సీ సెల్ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి మెండెం జమలయ్య మంగళవారం అందించారు. ధనేకుల సాంబయ్య, లింగాల మల్లేశ్వరరావు, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 11,517 మంది పింఛన్‌దారులక రూ.4.85 కోట్లు మంజూరు కాగా మంగళవారం 90 శాతం పైగా పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎం.చెన్నయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు
ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద,
గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 01166
మైలవరం : 99854 85777, 99854 09286
నూజివీడు : 99854 02464, నందిగామ : 99854 11620
తిరువూరు : 98498 25565, జగ్గయ్యపేట : 8919466168